క్లుప్తంగా

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత బుధవారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అసక్తి గల విద్యార్థులు ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 ప్రవేశ పరీక్ష రుసుము చెల్లించి, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫోటో జతచేసిhttps;//telanganams.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఐనవోలు : ఎస్సైగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన గైకాడి అనిల్‌కుమార్‌ను బుధవారం పలువురు నాయకులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, కాంగ్రెస్ పార్టీ, ఎంఎఎఫ్, స్వచ్ఛంద సంస్థ నాయకులు బొక్కల నారాయణ, కట్కూరి ప్రవీణ్, రమేష్, సతీష్ , రాజారపు రాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వేలేరు : మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించాల్సి ఉండగా సమయానికి ఎవరూ హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని ఈనెల 17వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీప్రసన్న ప్రకటించారు.

'ఇనగాల'కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ పరకాల ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయ్‌పాల్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వెంకట్రామ్‌రెడ్డి దశాబ్దకాలంగా నియోజకవర్గంలో ఇనగాల ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తు పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి గెలుపులో కీలక భూమిక పోషించారని అన్నారు. ఈ సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకుడు అలువాల రవి పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పరకాల : పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు పరకాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ కె.జగన్నాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ద్విచక్రవాహనాలతో పాటు బజాజ్ ఆటోకు చేపట్టే వేలంలో పాల్గొనే ఉత్సాహవంతులు ఉదయం 11 గంటలకు పరకాల ఎక్సైజ్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని ఆశాఖ సీఐ కె.జగన్నాథరావు కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కాశిబుగ్గ: పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ వీరయ్య, సముద్రాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఏసీరెడ్డినగర్ సీపీఎం కార్యాలయంలో అసోసియేషన్ శివనగర్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను ప్రకటించాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటింటా రామయ్య అక్షింతల వితరణ



ఆత్మకూరు : అక్షింతలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు



వేలేరు : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు : అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలను వివిధ గ్రామాల్లో పంపిణీ చేశారు. బుధవారం అయోధ్య తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులు శ్రీరామ విజయ మంత్రం జపిస్తూ అక్షింతలను ఇంటింటికి అందించారు. మహిళా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలను రుద్రరామేశ్వర ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఈనెల 22వ తేదీన నిర్వహించే అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామంలో పండగలా జరుపుకోవాలని కోరారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. వెంకటేశ్వర్లు, సంపత్, పెద్దిరెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాస్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షింతలను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పంపిణీ చేశారు. రామమందిరం ట్రస్టు ద్వారా 500 మంది వేద పండితులతో పూజించిన అక్షింతలను భక్తి శ్రద్ధలతో పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. గ్రామంలోని శ్రీరుక్మిణీ వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు నర్సింహాచారి, సాయి, భగవాన్ అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి గ్రామ పురవీధుల గుండా భక్తి గీతాలు ఆలపిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు ప్రారంభించిన శోభాయాత్ర సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నడికూడ : యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అన్నారు. మండలంలోని వరికోల్ గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా ఉండాలని అన్నారు. అలాగే చర్లపల్లి గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, ఆర్గనైజర్ బొల్లారం అనిల్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పాటు స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సాంబయ్య

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు



కాజీపేట: చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అధ్యాయనోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో పాటు నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. పండితుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలను బుధవారం రెండోరోజూ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, పూజారి రఘురామాచార్యులతో పాటు కాలనీ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

డప్పు, చెప్పు వృత్తిదారులకు పించన్ ఇవ్వాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

హన్మకొండ: డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని ఎమ్మార్పీఎస్ –టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోరుగర్జన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, డప్పు, చెప్పు కార్మికులను ఆదుకోవాలని గత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పోరుగర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ – టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ స్వామి, బొచ్చు మొగిలి, నాయకులు జన్ను సంజీవ్, తీగల సదన్, రాకేష్, గంగారపు యశ్వంత్, కొడవటి తిరుపతి, నాగరాజు, కొయ్యడ యాదగిరి, రాజు, గిన్నారపు అనిల్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి పూజలు



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయ అవరణలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరుడిని మధ్యాహ్నం అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి కొమురయ్య, బొమ్మగాని కృష్ణమూర్తి, ఓంకారేశ్వర్, ఉమాశంకర్, దయాసాగర్, శ్రీరాముల పెద్దన్న, సతీష్, అంకమ్మరావు, అర్చకుడు మార్త సందీప్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ వర్సిటీ భూముల కేటాయింపు సరికాదు

కేయూ క్యాంపస్: హైకోర్టు భవనాలకు అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల కేటాయింపును రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కేయూ అధ్యక్షుడు కొక్కుల ప్రశాంత్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు భవనాలు నిర్మించేందుకు కేటాయించటం సరికాదన్నారు. దాన్ని ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏబీవీపీ కేయూ సెక్రటరీ బొండ్ల శ్రావణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, నాయకులు రామ, ప్రణయ్, సాయికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం ధనుర్మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేయగా, సినీ నృత్య దర్శకురాలు సీతారత్నం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. నిత్యం ఆలయాల సందర్శన, భక్తి భావం అనే అంశాలపై అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల్లో గెలుపొందిన విజేతలకు ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు సాయికృష్ణ శర్మ బహుమతులు ప్రదానం చేశారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



లేఖను విడుదల చేస్తున్న తిరునహరి శేషు

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. ఈమేరకు తను రాసిన లేఖను సీఎం రేవంత్ రెడ్డికి మెయిల్ ద్వారా పంపారు. హనుమకొండ సుబేదారిలో ఆ లేఖను బుధవారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ చేపట్టిన పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందిందని విమర్శించారు. దీంతో నిరుద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో విశ్వాసం పెంపొందించేందుకు టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా నిపుణులతో బోర్డుని ఏర్పాటు చేసి యూపీఎస్సీ తరహాలో పరీక్షల నిర్వహణకు సంస్కరణలు తీసుకురావాలని కోరారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మానసిక దివ్యాంగులు హరిదాస్, సోదెమ్మ వేషధారణలో చిన్నారులు అలరించారు. బోగి మంటలు వేసి, గాలిపటాలు ఎగురవేశారు. బొమ్మల కొలువు పెట్టి, రంగవల్లులు వేసి ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి మాట్లాడుతూ పండుగ అంటే తమ సంతోషం మాత్రమే కాదని, పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ అని సూచించారు. అనాథలు, మానసిక దివ్యాంగులకు మధ్య వేడుకలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, రాజేందర్ రెడ్డి, సుష్మ, కరుకాల అర్పిత, వసుధ, హరిత పాల్గొన్నారు.



హరిదాస్, సోదెమ్మ వేషధారణలో దివ్యాంగులు

ఏకశిల హైస్కూల్‌లో..

నయీంనగర్: హనుమకొండ కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో ముందస్తుగా సంక్రాంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేశారు. గాలిపటాలు ఎగురవేసి, ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, స్వప్న, స్వాతి, కల్పన, సుమలత, జ్యోతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కైట్ ఫెస్టివల్

వేలేరు : సంక్రాతి పండగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో కైట్ ఫెస్టివల్ బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులు రంగురంగుల పంతంగులను ఎగురవేస్తూ పాఠశాల ప్రాగణంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాశ్, ఉపాధ్యాయులు రాజగోపాల్ పాల్గొన్నారు.



పతంగులతో పాఠశాల ఉపాధ్యాయులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటిరోజు అంకురార్పణ, ధ్వజారోహణం, హోమం, బలిహరణం, దేవతాహ్వానం కార్యక్రమాలను ఆయల ప్రధాన అర్చకులు శ్రీనివాస చార్యులు వేదమంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు. పూజా కార్యక్రమాలను సంప్రదాయకంగా నిర్వహించి స్వామివారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దూపదీప నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాస చార్యులు మాట్లాడారు. గురువారం ఎదురుకోళ్లు, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న బిందె తీర్థం, హోమం, 13న హోమం, సదస్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 14న పూర్ణాహుతి, ధ్వజపట ఉద్వాసన ఉటుందని పేర్కొన్నారు. 15న గుట్టపైకి స్వామివారిని తీసుకెళ్లటం, గుట్ట చుట్టూ బండ్లు తిరిగే కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 16న జాతర, మహాఅన్నదాన కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు పాల్గొంటారని వెల్లడించారు. 17న స్వామివారిని గ్రామానికి తీసుకురావడం, 18న కోనేరులో చక్రతీర్థం, నాగబలి, శ్రీపుష్పయాగం, 19న దుర్గంపేటలో శావతీసే కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, నాయకులు శ్రీధర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలి

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం ప్రధాన భూమిక పోషించాలని ఆయన అన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంపై పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యతో బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం కీలకపాత్ర పోషించాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త పట్టభద్రులను కలిసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వివరించాలని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు అందించిన తోడ్పాటును గుర్తు చేయాలన్నారు. నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వానికి పట్టభద్రుల అండ కూడా అవసరం అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తుందని అన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. చైతన్యవంతమైన పరకాల గడ్డా నుంచి శాసన మండలి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక ఓట్లు పడేలా కృషి చేయాలని కోరారు. లక్ష ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని అన్నారు. గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ ప్రతిసారి పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఫామ్ 18 పూరించి సంబంధిత పత్రాలు జపరిచి ఓటరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్న విషయాన్ని పట్టభద్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గాజర్ల అశోక్, స్థానిక ఎంపీపీ స్వర్ణలత, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేయాలి

కమలాపూర్ : కేజీబీవీ, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు అందకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈఎంఐ కట్టలేక, ఫీజులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. కేంద్ర వాటా నిధులు విడుదలైనప్పటికీ రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయక పోవడంతో వేతనాలు ఆలస్యం అవుతున్నాయని, అధికారులు స్పందించి సంక్రాంతి పండుగలోగా వేతనాలు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరువు భత్యాన్ని, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, ఏరియర్స్ తదితర బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీఎస్ఆర్ మల్లిక్, తిరునహరి శ్రీనివాస్, మండల బాధ్యులు నాగరాజు, పల్లె శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెండెం రాజు

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాంకిషన్‌రాజు



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

● మండల విద్యాధికారి రాంకిషన్‌రాజు

కమలాపూర్ : మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ రాంకిషన్‌రాజు అన్నారు. ప్రతిరోజు పరీక్షలు నిర్వహించి వచ్చిన ఫలితాలతో గ్రేడ్లు నిర్ధారించాలని ఉన్నత పాఠశాలల హెచ్ంలు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎంజేపీ, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ, ఎస్ఓలకు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు రాగులు, బెల్లంతో తయారు చేసిన రాగి జావాను తప్పనిసరిగా అందించాలని, మధ్యాహ్న భోజన బిల్లులు, రైస్ రిక్వైర్‌మెంట్, స్టాకు రిజిష్టర్లు ప్రతిరోజు సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సంబంధిత ఉపాధ్యాయుడికి సెలవు మంజూరు చేయబోమని అన్నారు. విద్యార్థులు పోర్షన్ కంప్లీట్ చేస్తూ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. పది పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులు సాధన చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువులో పోటీ తత్వాన్ని అలవర్చుకునే విధంగా వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు , కోఆర్డినేటర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) 2024 క్యాలెండర్, డైరీని ఎంఈఓ రాంకిషన్‌రాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా బాధ్యులు సంజీవరెడ్డి, అంజనీదేవి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి శ్రీనాథ్, మండల బాధ్యులు శ్రీనివాస్, శ్రీవాసు, పీడబ్ల్యూసీ వపన్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శ్రీధర్, వాణి, లక్ష్మారెడ్డి, నిర్మల, రాజేశ్వర్ నాయక్, రవీందర్, సత్యనారాయణ, రోజారమణి, వెంకన్న, రమేష్‌బాబు, అనిత, సాయిలత, సువర్ణ, జ్యోతి, కాంతయ్య, మమత పాల్గొన్నారు.